బైబులు భాష్యం - 198
సెప్టెంబరు - అక్టోబరు 2011

# ప్రాత నిబంధన కథలు

సంపాదకుడు :
**ఫాదర్ పి. జోజయ్య, S.J.**
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008
ఫోను - (0866)-2476329

# ప్రాత నిబంధన కథలు

## 1. లోకసృష్టి - *ఆది 1,3-2,4*

దేవుడు ఆరు రోజుల్లో విశ్వాన్ని సృష్టించి ఏడవరోజు విశ్రాంతి తీసికొన్నాడు. మొదటిరోజు వెలుగుని పుట్టించాడు. రెండవరోజు ఆకాశాన్ని చేశాడు. మూడవరోజు భూమినీ సముద్రాన్నీ వేరుజేశాడు. నేలమీద చెట్లను గూడ మొలిపించాడు. నాల్గవరోజు సూర్యచంద్రులనూ నక్షత్రాలనూ చేశాడు. ఐదవరోజు జలప్రాణులనూ ఆకాశంలో ఎగిరే పక్షులనూ చేశాడు. ఆరవ రోజు భూమిమీద సంచరించే జంతువులను చేశాడు. అన్ని ప్రాణులకంటె వెనుక నరులను సృజించాడు. ఏడవరోజు దేవుడు విశ్రాంతి తీసికొన్నాడు.

## 2. ఆది దంపతులు - *ఆది 2,7-25*

దేవుడు ఆరవ రోజున నరులను సృజించాడు. అతడు నేలమట్టిని తీసికొని దానిని బొమ్మగా మలిచాడు. దాని ముక్కు బెజ్జాలలోనికి ప్రాణవాయువును ఊదాడు. అది జీవించే ప్రాణి ఐంది. అతడే ఆదాము, తొలి నరుడు.

దేవుడు నరుడు వొంటరిగా వుండడం మంచిది కాదు, అతనికి తోడుగా వుండడానికి స్త్రీని గూడ చేద్దాం అనుకొన్నాడు. ఆదాముకి గాఢ నిద్ర కలిగించి అతని ప్రక్కటెముకను తీసి దాన్ని స్త్రీగా రూపొందించాడు. ఆమె పేరు ఏవ. ఆదాము ఆ స్త్రీని చూచి సంతోషించాడు. ఆమెను భార్యగా స్వీకరించాడు. దేవుడు వారిని అన్ని ఆనందాలు కల ఏదెను తోటలో వుంచాడు. ఆనాటి నుండి వివాహ వ్యవస్థ ప్రారంభమైంది.

## 3. ఆది తల్లిదండ్రుల పాపం -*ఆది 3*

దేవుడు ఆదాము ఏవలను ఏదెను తోటలో వుంచాడు. ఆ తోట మధ్యలో వున్న జ్ఞానవృక్షం పండ్లు మాత్రం తినవద్దని ఆజ్ఞ యిచ్చాడు. కాని పాము రూపంలో వున్న పిశాచం మీరా పండ్లు తింటే దేవునికి సరిసమానం ఔతారు సుమా అని మభ్యపెట్టింది. దాని మాటలు నమ్మి ఏవ ఆ చెట్టు పండ్లు కోసికొని తింది. కొన్ని భర్తకు కూడ ఇచ్చింది. ఆ ఫలాలు తినగానే వారికి జ్ఞానోదయం కలిగింది. చెట్ల ఆకులు కోసి

దిసమొలను కప్పుకొన్నారు. దేవుడు మీరు నేను తినవద్దన్న పండ్లు ఎందుకు తిన్నారని ప్రశ్నింపగా ఏవ పాము మీదా, ఆదాము ఏవ మీదా నేరం మోపారు. దేవుడు కోపించి ముగ్గురినీ శపించాడు. పాము పొట్టతో నేలమీద ప్రాకాలి. ఏవ పురిటి నొప్పులు భరించాలి. భర్త అధికారానికి లొంగి వుండాలి. ఆదాము నొసటి చెమటోడ్చి పొట్టకూడు సంపాదించుకోవాలి. దేవుడు ఆదాము ఏవలను తోటనుండి వెళ్లగొట్టాడు. ఈలా నరులు దేవుడంతటివాళ్లు కావాలనుకొని నాశం తెచ్చుకొన్నారు.

## 4. కయీను హేబెలును చంపడం - *ఆది4,1-12*

కయీను, హేబెలు ఆదామేవల కుమారులు. కయీను రైతు. అతడు పొలంలో పండిన పంటను దేవునికి కానుక పెట్టాడు. కాని అతని హృదయం మంచిది కాదు. కనుక దేవుడు ఆ కానుకను అంగీకరించలేదు. హేబెలు గొర్రెల కాపరి. అతడు గొర్రెపిల్లలను దేవునికి అర్పించాడు. దేవుడు వాటిని ప్రీతితో స్వీకరించాడు. అన్నకు తమ్ముని మీద అసూయ పుట్టింది. అతన్ని పొలానికి తీసికొనిపోయి చంపివేశాడు. ఇంత అన్యాయం జరిగింది చూడమని హేబెలు ప్రాణం దేవునికి మొరపెట్టింది. దేవుడు నీవు ఇల్లూ వాకిలీ లేకుండ దేశాల వెంటబడి తిరుగుతావు అని కయీనుని శపించాడు.

## 5. నోవా వోడను కట్టడం - *ఆది 6-8*

లోకంలోని నరులంతా దుష్టులైపోయారు. దేవుడు జలప్రళయం ద్వారా నరులను నాశం చేసి క్రొత్త సృష్టి చేయాలనుకొన్నాడు. ఆరోజుల్లో నోవా వొక్కడు మాత్రం దేవుని ఆజ్ఞలు పాటించాడు. అతడు దేవునికి నచ్చాడు. ప్రభువు అతన్ని పెద్ద వోడ కట్టమని ఆజ్ఞాపించాడు. దేవుడు చెప్పినట్లే నోవా వోడను నిర్మించాడు. అతని కుటుంబమంతా వోడలోనికి వచ్చింది. ఆ భక్తుడు ప్రతిజాతి మృగాలనుండీ, పక్షులనుండి ఒక ఆడు మగ జంటను గూడ ఓడలో చేర్చాడు. పనంతా ముగిశాక దేవుడు నలభై రోజుల పాటు కుండపోతగా వర్షం కురిపించాడు. ప్రపంచమంతా జలమయ మైంది. కొండలమీద పదిహేను అడుగుల యెత్తున నీళ్లు నిల్చాయి.

ప్రాణులన్నీ నాశమయ్యాయి. ఓడమాత్రం నీటిమీద తేలాడింది. చాలరోజుల తర్వాత వరద తీసిపోయి నీళ్లు ఇంకిపోయాయి. నోవా కుటుంబంతో, ఇతర ప్రాణులతో ఓడనుండి వెలుపలకి వచ్చాడు. కృతజ్ఞతా పూర్వకంగా దేవునికి బలి సమర్పించాడు. దేవుడు మళ్లా జలప్రళయం ద్వారా లోకాన్ని నాశం చేయనని నోవాకు మాట యిచ్చాడు. దానికి గురుతుగా ఆకాశంలో ఇంద్ర ధనుస్సు పెట్టాడు. ఆ మీదట క్రొత్తలోకం ప్రారంభమైంది.

## 6. బాబెలు గోపురం - *ఆది 11,1-9*

నోవా తర్వాత వచ్చిన జనం మళ్లా దుష్టులైపోయారు. వాళ్లు బాబెలు నగరంలో జీవిస్తూ అక్కడ పెద్ద గోపురం కట్టడానికి పూనుకొన్నారు. దాని మీదిగా స్వర్గానికి ఎక్కిపోయి తమకు పేరు తెచ్చుకోవాలనుకొన్నారు. వారి గర్వం దేవునికి నచ్చలేదు. అతడు వారి భాషను తారుమారు చేశాడు. అందుచే ఆ ప్రజలు ఒకరినొకరు అర్థంజేసికోలేక పోయారు. అంతటితో గోపుర నిర్మాణం ఆగిపోయింది. జనం ఆ నగరం నుండి లోకం నలుమూల లకు చెల్లాచెదరైపోయారు.

## 7. అబ్రాముకి పిలుపు - *ఆది 12,1-5*

కాల్దియా దేశంలోని ఊర్ అనే పట్టణంలో తెరా అనే నరుడు వసిస్తున్నాడు. అబ్రాము, నాహోరు, హారాను అతని కుమారులు. దేవుడు అబ్రాముని తన దాసునిగా ఎన్నుకొన్నాడు. అతనికి నూత్నదేశాన్నీ పెద్ద సంతతినీ దయచేస్తానని మాట యిచ్చాడు. అబ్రాముని ఊర్ నుండి ఆ నూత్న దేశానికి వెళ్లమని ఆజ్ఞాపించాడు. అతడు దేవునిమాట నమ్మి కుటుంబ సమేతంగా బయలు దేరి దారిలో కొన్నాళ్లు మోసపోటామియా దేశంలోని హారానులో వసించాడు. అక్కడి నుండి కదలి భార్య సారయితో చాలరోజులు ప్రయాణంచేసి కనాను దేశంలోని షెకెము చేరుకొన్నాడు. అప్పుడు అతనికి 75 ఏండ్లు. ఈ యబ్రామూ అతని సంతతీ భవిష్యత్తులో ఒక రక్షకుడు ఉద్భవిస్తాడని నమ్మారు. అబ్రాము సంతతి నుండే రెండువేల యేండ్ల తర్వాత మెస్సీయా ఉద్భవించాడు.

## 8. దేవుడు సొదొమను నాశం చేయడం - *ఆది 18,16-33*

సొదొమ గొమఱ్ఱా ప్రజలు బరితెగించి పోయారు. కనుక దేవుడు ఆ నగరాలను నాశం చేయాలని నిశ్చయించుకొన్నాడు. అబ్రాహాము ఆ పట్టణాల కొరకు దేవునికి విజ్ఞాపనం చేశాడు. అక్కడ యాభైమంది సజ్జనులుంటే ఆ వూళ్లను కాపాడమని వేడుకొన్నాడు. కాని అక్కడ అంతమంది మంచివాళ్లు లేరు. తర్వాత అతడు అక్కడ 45 మంది, 40 మంది, 30 మంది, 20 మంది, పదిమంది సజ్జనులుంటే ఆ వూళ్లను క్షమించమని వరుసగా దేవుణ్ణి వేడుకొంటూ వచ్చాడు. కాని అక్కడ పదిమంది నీతిమంతులు కూడ లేరు.

సొదొమ నగరంలో అబ్రాహాము తమ్ముని కుమారుడైన లోతు, అతని కుటుంబం వసిస్తున్నారు. దేవదూత వారిని ఆ నగరం నుండి వెళ్లి పొండని ఆజ్ఞాపించాడు. మీరు వెనుకకు తిరిగి చూడవద్దని హెచ్చరించాడు. వారు వెళ్లిపోగానే దేవుడు అగ్నిగంధకం కురిపించి నగరాలను కాల్చివేశాడు. దారిలో లోతు భార్య కుతూహలం కొద్దీ వెనుకకు తిరిగి చూచింది. ఆలా చూడగానే ఉప్పుస్తంభంగా మారిపోయింది -19,23-24.

## 9. అబ్రాహాము ఈసాకుని బలిగా సమర్పించడం - *ఆది 22*

అబ్రాహాము సారాలకు లేకలేక ముసలిప్రాయంలో ఈసాకు అనే కొడుకు పుట్టాడు. కాని దేవుడు అతనితో నీవు గాఢంగా ప్రేమించే నీ యేకైక కుమారుని మోరియా కొండమీద నాకు దహనబలిగా సమర్పించమని ఆదేశించాడు. అంతకు ముందే దేవుడు ఈ పిల్లవాడి ద్వారా అబ్రాహాము సంతతి ఆకాశంలోని చుక్కల్లాగ అనంతంగా వ్యాపిస్తుందని మాట యిచ్చాడు. ఈసాకు చనిపోతే ఆ ప్రమాణం ఏలా నెరవేరుతుంది? ఐనా అబ్రాహాము వెనుకాడలేదు. దేవుని మీద మొరపడలేదు. అతన్ని తిట్టి పోయలేదు. దేవుని ఆజ్ఞకు బద్ధుడై కుమారుని కొండమీదికి తీసికొని పోయి బలివేదికను నిర్మించాడు. ఈసాకుని చంపి కాల్చివేయడానికి కత్తి దూశాడు. కాని దేవదూత అడ్డు వచ్చి కుమారుని చంపనీయలేదు. అబ్రాహాము ప్రక్క పొదలో కొమ్ములు చిక్కుకొని వున్న పొట్టేలిని తీసికొని

వచ్చి దేవునికి దహనబలిగా సమర్పించాడు. అతడు దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గాడు. తాను దేవునికి విధేయుడననీ, దైవభక్తి కలవాడననీ రుజువు చేసికొన్నాడు. తనకు ఈసాకు కంటె దేవుడే యెక్కువని నిరూపించుకొన్నాడు. దేవుడు అబ్రాహాము భక్తికి సంతసించి అతని సంతానాన్ని అంసఖ్యాకంగా వృద్ధి చేస్తానని మళ్లా శపథం చేశాడు. తర్వాత వెయ్యేండ్లకు సొలోమోను రాజు ఆ తావుననే దేవాలయం నిర్మించాడు.

## 10. ఈసాకు రిబ్కాల వివాహం - *ఆది 24*

అబ్రాహాము తన కుమారుడైన యీసాకుకి పెండ్లి చేయగోరాడు. కనానీయుల పిల్లను గాక తన బంధువుల అమ్మాయిని కోడలినిగా జేసికోవాలనుకొన్నాడు. కనుక నమ్మకంగల పెద్ద సేవకుడు యేలీయెసరుని హారానుకి పంపాడు. ఆ సేవకుడు ఒంటెలతో పోయి ఆ వూరి బావి దగ్గర ఆగాడు. ఓ ప్రభూ! నాకూ నా వొంటెలకు నీళ్లు తోడిపోసే బాలికే మా యజమానునికి కోడలు అగును గాక అని దేవునికి ప్రార్థన చేశాడు. ఆ సమయానికి అబ్రాహాము తమ్ముడు నాహోరు మనుమరాలైన రిబ్కా బావికి నీళ్లకు వచ్చింది. సేవకుడు అడగగానే ఆమె అతనికీ వొంటెలకూ నీళ్లు తోడి పోసింది. ఆ బాలికే దేవుడు నిర్ణయించిన వధువు అని గ్రహించి సేవకుడు ఆమె యింటికి పోయి అక్కడే బస చేశాడు. ఆ యింటి వారికి కానుకలు సమర్పించి తాను వచ్చిన పని తెలియజేశాడు. తల్లిదండ్రులతో పాటు రిబ్కా కూడ ఈసాకుని పెండ్లియాడ్డానికి సమ్మతించింది. సేవకుడు బాలికను తీసికొని అబ్రాహాము దగ్గరికి తిరిగి వచ్చాడు. తండ్రి కొడుకునకు పెండ్లిచేశాడు. రిబ్కా చాలాయేండ్ల పాటు గొడ్రాలుగా వుండిపోయింది. తర్వాత కవల బిడ్డలను కంది. వారే యేసావు, యాకోబులు. దేవుడు భక్తుల కోర్కెలు తప్పక తీరుస్తాడు.

## 11. యాకోబు ఏసావు జ్యేష్ఠ భాగాన్ని కొట్టేయడం

*- ఆది 25,27-34*

ఏసావు జింకలను వేటాడి తండ్రికి మాసం తెచ్చి యిచ్చేవాడు. కనుక ఈసాకుకి అతడంటే యిష్టం. తల్లికి యాకోబు ఇష్టం. అతడు

ఇంటి పట్టుననే వుండేవాడు. ఒకసారి యేసావు వేటకు వెళ్లి అక్కడ యేమీ దొరకనందున అలసిపోయి వట్టి చేతులతో తిరిగివచ్చాడు. ఇంటిపట్టున యాకోబు కమ్మని పులుసు చేసివుంచాడు. ఏసావు ఆ పులుసు త్రాగగోరాడు. యాకోబు నీ జ్యేష్ఠ భాగం వదులుకొంటే ఈ పులుసు నిస్తానని షరతు పెట్టాడు. యేసావు తేలిక మనిషి. జ్యేష్ఠభాగాన్ని వొదలుకొని పులుసు త్రాగి నెమ్మదిగా వెళ్లిపోయాడు.

## 12. యాకోబు అన్నను మోసగించడం - *ఆది 27*

ఈసాకు పండు ముసలి అయ్యాడు. కంటి చూపు కూడ కోల్పోయాడు. మరణం దాపులోనే వుందని గ్రహించాడు. పెద్ద కొడుకు ఏసావును పిలచి జింకను వేటాడి మాంసం తెచ్చి వండిపెట్టు. చనిపోక ముందు నిన్ను దీవిస్తాను అని చెప్పాడు. ఆ దీవెన పొందినవాళ్లు బాగా వృద్ధి చెంది తండ్రి వంశాన్ని నిలబెడతారు. సరే, యేసావు వేటకు వెళ్లాడు. ఈసాకు మాటలు తల్లి రిబ్కా వింది. ఆమె తండ్రి దీవెన చిన్న కొడుకు యాకోబుకి దక్కాలనుకొంది. అతన్ని యేసావులా నటించమని చెప్పింది. మేక పిల్లను చంపి తండ్రికి ఇష్టమైన రీతిలో మాంసం వండింది. యాకోబుని యేసావు దుస్తులు ధరించమని చెప్పింది. అతని చేతులకు మేకపిల్ల తోళ్లు కప్పింది. యాకోబు భోజనం తీసికొనిపోయి తండ్రిని దీవించమని అడిగాడు. గ్రుడ్డివాడైన ఈసాకు కుమారుని తడివి చూచి నాయనా! నీ గొంతు యాకోబు గొంతు. కాని నీ వొడలు యేసావు వొడలు అని పల్కి భోజనం ఆరగించి యాకోబు ఏసావే అనుకొని అతన్ని దీవించాడు. దానివల్ల యాకోబుకి సిరిసంపదలు కలుగుతాయి. అతడు అన్నకు అధిపతి కూడ ఔతాడు. తర్వాత ఏసావు వేట మాంసంతో తిరిగివచ్చి భోజనం సిద్ధం జేసికొని తండ్రి దగ్గరికి వచ్చాడు. అప్పుడు ఈసాకుకి యాకోబు మోసం అర్థమైంది. ఏసావు నిరాశ చెంది తన్ను కూడ దీవించమని బతిమాలాడు కాని తండ్రి దీవెన ఫలించేది ఒక్కసారే. ఏసావు తమ్ముని వలన రెండుసార్లు నష్టపోయినందుకు ఆగ్రహించి అతన్ని చంపాలని నిశ్చయించుకొన్నాడు. రిబ్కా చిన్నకొడుకుని హారానులోని మేనమామ లాబాను దగ్గరికి పంపి చావుని తప్పించింది. ఆమె యాకోబుని

మళ్లా కంటితో చూడనేలేదు. ఏసావు అన్యజాతి వారైన హిత్తీయుల పిల్లలను పెండ్లిచేసికోగా వాళ్లు అత్తమామలను చాల విసిగించారు. ఈసాకు రిబ్కా యిద్దరూ పక్షపాత బుద్ధితో వ్యవహరించి పిల్లలను చెడగొట్టారు.

## 13. బేతేలు వద్ద యాకోబుకి దైవదర్శనం - *28,10-22*

యాకోబు అన్న నుండి పారిపోయి హారానుకి వెళ్తూ దారిలో ఒకచోట రాత్రి నిద్రపోయాడు. అతనికి కలలో దేవదూతలు నిచ్చెన మీదిగా ఎక్కుతూ దిగుతూ వున్నట్లుగా కన్పించారు. అనగా అతడు దైవసాన్నిధ్యంలో వున్నాడని భావం. దేవుడు అతనితో నేను నీ తండ్రితాతలు కొలిచిన దేవుణ్ణి సుమా! ఈ ప్రదేశాన్ని నేను నీ సంతతికి ఇస్తాను. నీకు ఎప్పుడూ సహాయం చేస్తుంటాను. నిన్ను మళ్లా సురక్షితంగా ఈ తావుకి తీసికొని వస్తాను అని చెప్పాడు. యాకోబు మేల్కొని ఆ కలను తలంచుకొని భయపడ్డాడు. ఇది దేవుడు వసించే తావు అనుకొన్నాడు. తాను తలదిండుగా వాడుకొన్న రాతిని తీసి పవిత్ర స్తంభంగా నాటి దానిమీద తైలంపోసి అభిషేకం చేశాడు. ఓ దేవాలయం లాంటిదాన్ని ఏర్పాటు చేశాడు. ఆ చోటికి బేతేలు, అనగా దేవుని యిల్లు అని పేరు పెట్టాడు. యాకోబు దేవుడు నన్ను మళ్లా భద్రంగా మా యింటికి తీసికొని వస్తాడు అని నమ్మాడు. తన సంపాదనలో పదవ వంతు దేవునికి కానుకగా యిస్తానని మొక్కుకొన్నాడు.

## 14. ఏసావు తమ్ముని క్షమించడం - *ఆది33*

యాకోబు మేనమామ లాబాను ఇంటిలో 14 ఏండ్లు గడిపాడు. అతని కొమార్తెలు లెయా రాహేలులను పెండ్లి జేసికొన్నాడు. సిరిసంపదలు ఆర్జించి ఆలుబిడ్డలతో కనాను దేశానికి తిరిగి వస్తున్నాడు. తమ్ముడు వస్తున్నాడని తెలిసికొని ఏసావు నాల్గు వందల మంది అనుచరులను ప్రోగుజేసికొని అతన్ని కలుసుకోవడానికి ఎదురు వచ్చాడు. పూర్వవైరం వలన అన్నను చూడగానే తమ్మునికి హడలు పుట్టింది. అతడు అన్న ముందు ఏడుసార్లు నేలమీద బోర్లపడి నమస్కారం చేశాడు. ఏసావు తమ్మునిమీద పగతీర్చుకోవడానికి గాక అతన్ని ప్రేమతో ఆహ్వానించడానికి వచ్చాడు. కనుక పరుగెత్తుకొని వచ్చి తమ్ముని కౌగిలించుకొని మెడమీద

ముద్దు పెట్టుకొన్నాడు. అన్నదమ్ములిద్దరూ ఆనందంతో కన్నీరు కార్చారు. ఏసావు తమ్ముని ద్రోహం మరచిపోయి పెద్ద మనసుతో అతన్ని క్షమించాడు. యాకోబు అన్నకు కానుకలు అర్పించాడు. తర్వాత ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు. యాకోబు కనాను దేశంలోని షెకెములో నివసించాడు.

## 15. యోసేపు కలలు – *ఆది 37*

యాకోబుకి పండ్రెండుమంది కుమారులు కలిగారు. వారిలో రాహేలుకి పుట్టిన యోసేఫంటే తండ్రికి ఎక్కువ ప్రీతి. కనుక అతనికి ముద్దుగా పొడుగు చేతుల నిలువటంగీని కుట్టించాడు. దాని వలన సోదరులకు యోసేఫు మీద అసూయ కలిగింది. పైగా యోసేపుకి రెండు కలలు వచ్చాయి. సోదరుల పనలు తన పనకు నమస్కారం చేసినట్లుగాను. సూర్యచంద్రులూ పదకొండు నక్షత్రాలూ తనకు దండం పెట్టినట్లుగానూ కలలు వచ్చాయి. తమ్ముడు అన్నలకు అధిపతి ఔతాడని ఆ కలల భావం కనుక సోదరులు అతన్ని ద్వేషించి చంపివేయగోరారు. మళ్లా చంపడ మెందుకు లెమ్మని వట్టిపోయిన బావిలో పడద్రోశారు. తర్వాత బావినుండి పైకితీసి యిస్రాయేలు వర్తకులకు అమ్మివేశారు. వాళ్లు అతన్ని ఈజిప్టుకి కొనిపోయి పోతీఫరు అనే సైనికాధికారికి అమ్మివేశారు. అన్నలు యోసేఫు నిలువుటంగీని మేకపిల్ల నెత్తుటిలో ముంచి యాకోబు దగ్గరికి పంపించారు. కుమారుని ఏదో అడవిమృగం చంపివేసిందని చెప్పించారు. యాకోబు కొడుకు నిజంగానే చనిపోయాడనుకొని బట్టలు చించుకొని గోనె తాల్చి చాలరోజుల వరకు తీవ్రంగా దుఃఖించాడు.

## 16. పోతీఫరు భార్య నేరం మోపడం – *ఆది 39*

పోతీఫరు భార్య యోసేపు మీద కన్నువేసి తనతో శయనింపమని ప్రలోభపెట్టింది. కాని యోసేపు అమ్మా! యజమానుడు నన్ను నమ్మి నిన్నొక్క దానిని తప్ప ఈ యింటిలోని సంగతులన్నీ నాకు ఒప్పజెప్పాడు. నేను యజమానునికీ దేవునికీ ద్రోహం చేయకూడదు అని చెప్పాడు. ఒకరోజు ఆమె యోసేఫు పైబట్ట పట్టుకొని తనతో శయనింపమని నిర్బంధం చేసింది. అతడు ఆ బట్టను అక్కడే వదలిపెట్టి వెలుపలికి పారిపోయాడు. తర్వాత

ఆమె ఆ బట్టనే ఆనవాలుగా చూపి యోసేపు తనను చెరచబోయాడనీ, తాను కేకలు వేయగా పారిపోయాడనీ భర్తకు పిర్యాదు చేసింది. పోతీఫరు ఆమె మాటలు నమ్మి యోసేపుని చెరలో త్రోయించాడు. అతడు రెండేండ్ల పాటు ఆ చెరలోనే వున్నాడు.

## 17. సేవకుల కలలు - *ఆది 40*

యోసేపు వున్న చెరలోనే రాజు వంటవాడు, పానీయవాహకుడు కూడ వున్నారు. వాళ్లిద్దరూ కలలు కనగా యోసేపు వాటికి అర్థం చెప్పాడు. పానీయవాహకుడు మూడు రెమ్మలు కల ద్రాక్ష తీగనుండి పండ్లుకోసి రసం పిండి రాజుకు అందించినట్లుగా కలగన్నాడు. యోసేపు ఈ కల భావం ఇది. మూడు రోజుల్లోనే రాజు నిన్ను మన్నించి మళ్లా పూర్వపు పనిలో నియమిస్తాడు. నీవు చెరనుండి తప్పించుకొన్నప్పుడు నన్ను జ్ఞాపకం బెట్టుకో అని చెప్పాడు.

వంటలవాడు నేను పిండివంటల గంపలు మూడు రాజుదగ్గరికి మోసుకుని పోతున్నాను. కాని పై గంపలోని వాటిని పక్షులు తింటున్నాయి. ఇది నా కల అని చెప్పాడు. యోసేపు ఈ కల భావం ఇది. మూడు రోజుల తర్వాత రాజు నిన్ను చంపించి చెట్టుకి వ్రేలాడ దీయిస్తాడు. అప్పుడు ఆకాశ పక్షులు నీ శరీరాన్ని తినివేస్తాయి అని చెప్పాడు. తర్వాత యోసేపు చెప్పినట్లుగానే జరిగింది. ఐతే పానీయ వాహకుడు విడుదల పొందినా యోసేపుని మర్చిపోయాడు.

## 18. ఫరో కలలు - *ఆది 41*

ఒకరాత్రి ఈజిప్టుని పరిపాలించే ఫరోరాజుకి రెండు కలలు వచ్చాయి. మొదటి కలలో బక్కచిక్కిన ఏడావులు బలసిన ఏడావులను మింగివేశాయి. రెండవ కలలో ఏడు పీల కంకులు గింజలు పట్టిన ఏడు గట్టి కంకులను మింగివేశాయి. రాజు ఈ కలల భావం ఏమిటని తన సలహాదారులను అడిగాడు గాని వాళ్లు జవాబు చెప్పలేక పోయారు. కలల అర్థం చెప్పడానికి యోసేపు వంతు వచ్చింది. అతడు రెండు కలలకు ఒకే అర్థం చెప్పాడు. ఏడు బలసిన ఆవులకూ, ఏడు గట్టికంకులకూ సూచనంగా దేశంలో

ఏడేండ్లపాటు బాగా పంటలు పండి ధాన్యం నిండిపోతుంది. అటు తర్వాత ఏడు బక్కచిక్కిన ఆవులూ ఏడు పీల కంకులకు సూచనంగా దేశంలో ఏడేండ్లపాటు గొప్ప కరువు వస్తుంది. కనుక రాజు ఒక తెలివి కల అధికారిని నియమించి బాగా పంటలు పండిన ఏడేండ్ల కాలంలో ధాన్యాన్ని నిల్వజేయిం చాలి. దాన్ని తర్వాత వచ్చే ఏడేండ్ల కరువు కాలంలో వాడుకోవాలి.

రాజు యోసేపు తెలియజేసిన కలల భావాన్ని విని సంతోషించాడు. అతన్నే ఈజిప్టుకి సర్వాధికారిగా నియమించాడు. యోసేపు ఏడేండ్ల పంట కాలంలో ధాన్యాన్ని ప్రోగుచేసి నగరాల్లో నిల్వ జేయించాడు. కరువు కాలంలో దాన్ని ప్రజలకు పంచిపెట్టారు. పొరుగు దేశాల ప్రజలు కూడ ఈజిప్టుకి వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కనుక ఆ దేశానికి మంచిపేరు వచ్చింది.

## 19. యోసేపు సోదరులను క్షమించడం - *ఆది 50,18-26*

కనాను దేశం నుండి అన్నలు రెడుసార్లు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఈజిప్టులోని యోసేపు దగ్గరికి వచ్చారు. రెండవసారి యోసేపు తన్ను తాను సోదరులకు తెలియజేసికొన్నాడు. సోదరులూ, యాకోబూ కూడ యోసేపు బ్రతికి వున్నందుకూ, ఈజిప్టుకి అధికారి ఐనందుకూ ఆశ్చర్యపోయారు. తర్వాత యాకోబు కుటుంబ మంతా ఈజిప్టుకి వలస వచ్చి అక్కడే స్థిరపడింది. యాకోబు చనిపోయాక సోదరులు యోసేపు తమ మీద పగతీర్చుకొంటాడేమోనని భయపడ్డారు. కనుక అతని దగ్గరికి వచ్చి మేము నీ దాసులం అని చాగిలపడ్డారు? యోసేపు మీరైతే నాకు కీడు తలపెట్టారు. కాని దేవుడు ఆ కీడును మేలుగా మార్చాడు. మన కుటుంబంతోపాటు ఇంతమంది ప్రాణాలను కాపాడ్డానికే దేవుడు ముందుగా నన్నిక్కడికి పంపాడు. నేను మిమ్ము తప్పక ఆదరిస్తాను అని చెప్పాడు. అతని మంచితనానికి సోదరులు విస్తుపోయారు. యోసేపు ఈజిప్టులో 110 యేండ్లు బ్రతికి చనిపోయాడు.

## 20. యోబు భక్తి - *యోబు 1-2*

యోబు అబ్రాహాముతోపాటు కాల్దియా దేశంలో వసించాడనీ, అతనికి సమకాలికుడనీ కొందరి తలంపు. అతడు పాపాన్ని విడనాడి

దేవునిపట్ల భయభక్తులతో జీవించాడు. అతనికి పెద్ద సంతానమూ సిరిసంపదలూ వున్నాయి. దేవునికి అతడంటే యిష్టం. సాతానుకి మాత్రం అతడు గిట్టలేదు. సాతాను యోబు వట్టినే నిన్ను పూజించడం లేదు. నీ సిరిసంపదల కోసం నిన్ను కొలుస్తున్నాడు అని వాదించాడు. దేవుడు సాతానుకి యోబుని పరీక్షించడానికి అనుమతినిచ్చాడు. అతని ప్రాణాలు మాత్రం తీయకూడదు. సాతాను యోబుని నానా విధాల శోధించాడు. అతని ఆస్తిపాస్తులు పోయాయి. కొడుకులూ కూతుళ్లూ చనిపోయారు. పెద్ద వ్యాధిబాధలు వచ్చిపడ్డాయి. ఐనా యోబు దేవునికి విధేయుడయ్యాడే గాని పల్లెత్తుమాట అనలేదు. యోబు భార్య దేవుడు నీకిన్ని కష్టాలు పంపాడు కదా! చనిపోకముందే అతన్ని బాగా శపించి చావు అని సలహా యిచ్చింది. కాని యోబు దేవుడు ఇంతకాలం లాభాలు ఇస్తే బాగా అనుభవించాం. ఇప్పుడు కీడులు పంపితే అతన్ని తిడతామా అన్నాడు. ఎన్ని దురదృష్టాలు వచ్చినా అతడు దేవుణ్ణి దూషించలేదు. యోబు భక్తికి మెచ్చి దేవుడు అతడు పోగొట్టుకొన్న దానికంటె అధికంగా మళ్లా సిరిసంపదలూ సంతానమూ దయచేశాడు. మహా భక్తుడైన యోబు నేటికీ మనకు ఆదర్శంగా వుంటాడు.

## 21. నైలునదిలో మోషే శిశువు – *నిర్గ 1*

యాకోబు కాలంలో ఈజిప్టుకి వలసవెళ్లిన యిస్రాయేలు ప్రజలు ఆదేశంలో తామరతంపరగా వృద్ధి చెందారు. ఆ దేశాన్ని యేలే ఫరోరాజు వారిని చూచి భయపడ్డాడు. వారిని బానిసలుగా చేసి వెట్టిచాకిరి చేయించుకొన్నాడు. ఆ ప్రజల జనసంఖ్యను తగ్గించడానికి వారికి పుట్టిన మగబిడ్డలందరినీ నైలునదిలో త్రోయించాడు. ఆ పరిస్థితుల్లో యోకెబెదు అనే యిస్రాయేలు స్త్రీ మోషే అనే మగబిడ్డను కంది. ఆ శిశువు ప్రాణాలు రక్షింపగోరి వాణ్ణి తారుపూసిన పెట్టెలో పెట్టి నైలునదిలోని జమ్ములో వదలిపెట్టింది. ఫరో కూతురు నదిలో జలకాలు ఆడ్డానికి వచ్చి పెట్టె తెరచి చూచింది. శిశువు మీద జాలి కలిగి వాణ్ణి దత్తు తీసికొంది. రాజకుమారి శిశువుకి ఒక దాదిని నియమించాలనుకొంది. శిశువుని కనిపెట్టడానికి ఆ ప్రక్కనే వేచివున్న మోషే సోదరి సొంత తల్లినే దాదిగా పిల్చుకొని వచ్చింది.

బాలుడు రాజుగారి మేడలోనే రాజకుమారుల్లాగా పెరిగి పెద్దవాడయ్యాడు. ఈజిప్టులోని విద్యలన్నీ నేర్చుకున్నాడు. నలభై యేండ్ల వరకు ఈజిప్టులోనే వుండిపోయాడు.

## 22. మండుతూవున్న పొదలో దైవదర్శనం - *నిర్గ 3*

ఒక పర్యాయం మోషే ఒక ఈజిప్టీయుణ్ణి చంపగా ఫరో కోపించి అతన్ని ప్రాణాలు తీయబోయాడు. మోషే మిద్యాను ఎడారికి పారిపోయాడు. ఆ దేశపు పూజారియైన రగూవేలు కొమార్తె సిప్పోరాను పెండ్లి చేసికొన్నాడు. రోజూ మామ మందలను తోలుకొని పోయి హోరేబు కొండ దగ్గర మేపుకొని వచ్చేవాడు. ఓదినం అతడు మందలను మేపుతుండగా కొండమీద ఓ పొదకు నిప్పంటుకొంది. అది యెంతసేపు మండినా బుగ్గయిపోలేదు. అది ఆలా యెందుకు బూడిదయి పోలేదో చూద్దామని మోషే పొద దగ్గరికి వెళ్లాడు. దేవుడు అతనితో నేను మీ పితరుల దేవుణ్ణి. ఈజిప్టులో యిస్రాయేలు ప్రజలు ఫరో దాస్యంలో చిక్కుకుని నానా బాధలకు గురై నాకు మొరపెట్టారు. నీవు వారిని ఆ దాస్యం నుండి విడిపించడానికి ఫరో దగ్గరికి వెళ్లాలి సుమా అని చెప్పాడు. మోషే అంతకుముందే ఈజిప్టు నుండి పారిపోయి వచ్చాడు. కనుక ఫరో దగ్గరికి వెళ్లడానికి జంకాడు. కాని ప్రభువు అతనికి అభయమిచ్చి నేను నీకు తోడైయుంటానని చెప్పాడు. తన దివ్యనామాన్ని మోషేకు తెలియజేశాడు. అతడు తన కర్రతో అద్భుత కార్యాలు చేసే శక్తినిచ్చాడు. అతనికి తోడుగా వుండడానికి అహరోనుని గూడ జతపరచాడు. మోషే భార్యా పిల్లలతో ఈజిప్టుకి తిరిగివచ్చాడు.

## 23. రెల్లు సముద్రం దాటడం - *నిర్గ 14*

మోషే వేడుకొన్నా ఫరో మొదట ప్రజలను పంపివేయడానికి వొప్పుకోలేదు. దేవుడు మోషే ద్వారా ఈజిప్టు మీదికి పది అరిష్టాలను పంపాడు. ఆ దేశంలో పంటలన్నీ నాశమయ్యాయి. పశువులు చచ్చాయి. రోగాలు ప్రబలాయి. నీళ్లు నెత్తురుగా మారాయి. చీకట్లు అలముకొన్నాయి. పదవ అరిష్టంలో దేశంలోని తొలిచూలు పిల్లలంతా చచ్చారు. సింహాసనం ఎక్కనున్న ఫరో కుమారుడు కూడ చనిపోయాడు. ఆ రాజు గుండె చెదరి

జనాన్ని వెళ్లిపోనిచ్చాడు. మోషే బానిసంలో మ్రగ్గుతున్న ప్రజలను తోడ్కొని కనాను దేశానికి ప్రయాణమయ్యాడు. 430 ఏండ్ల దాస్యం ముగిసింది. అంతా రెల్లు సముద్రం దగ్గరికి వచ్చారు. యిస్రాయేలు జనం ఇంచుమించు ఆరు లక్షలమంది పురుషులు. ప్రభువు కలిగించిన మేఘస్తంభం ప్రజలను నడిపించింది. అది పగలు నల్లని మబ్బులాగాను, రాత్రి అగ్ని లాగాను కన్పించేది. కాని ఫరో మనసు మార్చుకొని ప్రజలను మళ్లా పట్టుకొని పోవడానికి రథాలతో గుర్రాలతో వచ్చాడు. ముందు సముద్రం, వెనుక శత్రు సైన్యం. ప్రజలు దిక్కుదోచక దేవునికి మొరపెట్టారు. ప్రభువు ఆజ్ఞపై మేఘస్తంభం యిస్రాయేలీయులకు వెలుగునీ ఈజిప్టీయులకు చీకటినీ కలిగించింది. మోషే చేతిని చాపగా సముద్రం రెండు పాయలుగా చీలిపోయింది. రెండువైపుల నీళ్లు అడ్డుగోడల వలె నిల్చిపోయాయి. యావే ప్రజలు పొడినేల మీదిగా నడచినట్లుగా సముద్ర గర్భం గుండ నడచి ఆవలి వొడ్డు చేరుకొన్నారు. ఫరో సైన్యం గూడ సముద్రగర్భంలోకి దిగింది. కాని మోషే మళ్లా చేయి చాపగా ఇరువైపుల వున్న నీళ్లు తిరిగి కలసి పోయాయి. ఫరో సైన్యమంతా నీటిలో మునిగి చచ్చింది. దైవప్రజలు దేవుడు చేసిన మహాద్భుతానికి సంతోషించి యావేను కీర్తించండి. ఆయన గుర్రాలనూ రౌతులనూ సముద్రంలో కూలద్రోశాడు అని పాటపాడారు.

## 24. కొండమీద ధర్మశాస్త్రం - *నిర్గ 19,16-20*

ప్రజలు ఈజిప్టు నుండి బయలుదేరిన యాబయవ దినాన సీనాయి కొండను చేరుకొన్నారు. మూడవ రోజు మోషే కొండనెక్కగా ప్రభువు దాని మీదికి దిగివచ్చాడు. కొండమీద నల్లని మబ్బు కమ్మింది. ఉరుములు, మెరుపులు, పొగ, అగ్ని కనిపించాయి. కొమ్ము బూర మ్రోగింది. దేవుడు అగ్ని రూపంలో దిగిరాగా కొండ దద్దరిల్లింది. క్రిందవున్న ప్రజలు భయంతో గడగడ వణికారు. మోషే కొండ శిఖరం మీదికి ఎక్కాడు. ప్రభువు ఉరుములాంటి శబ్దంతో అతనితో మాటలాడాడు.

ఆ కొండమీదనే ప్రభువు మోషేకు పదియాజ్ఞల రూపంలో ధర్మశాస్త్రాన్ని దయచేశాడు. ఆయాజ్ఞలను రెండు రాతిపలకల మీద వ్రాసి

యిచ్చాడు. ఈయాజ్ఞలను పాటించడం ద్వారా ప్రజలు ఏక సమాజంగా ఒనగూడి దేవుని ప్రజలయ్యారు. ఆ జనం దేవుని పట్ల తోడి నరులపట్ల ఏలా ప్రవర్తించాలో ఈ యాజ్ఞలు తెలియజేస్తాయి. క్రీస్తు విచ్చేసిందాకా, అనగా 13 వందల యేండ్లపాటు ఈధర్మశాస్త్రం యూదులకు రక్షణ సాధనమైంది.

## 25. చేదు నీళ్లు – *నిర్గ 15,22-25*

ప్రజలు ఎడారిలో ప్రయాణం చేస్తూ షూరు అరణ్యాన్ని చేరారు. అక్కడ మూడు నాళ్లపాటు త్రాగడానికి నీరు దొరకలేదు. మారా అనే తావులో నీళ్లు కన్పించాయి గాని అవి చేదు పుట్టలు. దేవుని ఆజ్ఞపై మోషే ఒక కొయ్యను నీటిలో పడవేయగా అవి తీయనయ్యాయి. జనం దప్పిక తీర ఆ నీళ్లు త్రాగారు.

## 26. మన్నా, పూరేడు పిట్టలు – *నిర్గ 16*

జనం సీను అరణ్యాన్ని చేరారు. అక్కడ వారికి ఆహారం లభించలేదు. పస్తులుండలేక మోషేమీద తిరగబడ్డారు. ఈజిప్టులో దాస్యంలో వున్నా కడుపు నిండా తిండి దొరికింది. ఈ యరణ్యంలో తినడానికి తిండి లేదు అని సణిగారు. మోషే దేవునికి మొరపెట్టగా ప్రభువు వారికి ఆకాశం నుండి మన్నాను కురిపించాడు. వారంలో ఆరు రోజులపాటు ప్రతిరోజు ఉదయం మన్నా కురిసేది. జనం దాన్ని ప్రోగుజేసికొని వండుకొని తినేవాళ్లు. ఆరురోజులు సాయంకాలం పూరేడు పిట్టలు వచ్చి వారి శిబిరాల్లో వాలేవి. ప్రజలు వాటిని పట్టుకొని మాంసం వండుకొని భుజించేవాళ్లు. ఏడవనాడు విశ్రాంతి దినం. ఆ దినం మన్నా కురువదు. కనుక ఆరవనాడే రెండు రోజులకు సరిపోయినంత ప్రోగుజేసికొనేవాళ్లు. మన్నా తెల్లని రంగులో ధనియాల ఆకారంలో వుండేది. రుచికి తేనెవలె తీయగా వుండేది. ఎడారి కాలం నలభై యేండ్ల పాటు మన్నా కురుస్తూనే వుంది.

## 27. రాతినుండి నీళ్లు – *నిర్గ 17,1-7*

జనం రెఫీదీము వద్ద విడిది చేశారు. అక్కడ కూడ నీళ్లు దొరకలేదు. వెంటనే ఇక్కడ మేము, మా పిల్లలు, పశువులు దప్పికతో చావాలా యేమి

అని మోషేతో జగడమాడారు. దేవుని ఆజ్ఞపై మోషే పెద్దలతో పోయి కొండమీది రాతిబండను కర్రతో బాదాడు. అద్భుతంగా బండనుండి నీళ్లు పారాయి. జనం ఆ నీళ్లు త్రాగి సంతోషించారు. ఆ చోటికి మస్సా, మెరీబా అని పేర్లు వచ్చాయి. మస్సా అంటే జగడమాడ్డం, మెరీబా అంటే పరీక్షించడం.

## 28. బంగారు దూడను ఆరాధించడం - *నిర్గ 32*

మోషే కొండమీదికి వెళ్లి దేవుని సన్నిధిలో వుండిపోయి నలభైరోజుల వరకు దిగిరాలేదు. ప్రజల విశ్వాసం చలించింది. వాళ్లు అహరోనుతో ఆమోషేకు ఏమీ కీడు మూడిందో మాకు తెలియదు. నీవు మాకొక క్రొత్త దేవరను చేసిపెట్టు అన్నారు. అహరోను స్త్రీల నగలను కరిగించి బంగారు దూడను పోతపోశాడు. అది ఆ రోజుల్లో కనానీయులు కొల్చే బాలు దేవతకు చిహ్నం. ప్రజలు ఆ దూడకు బలులు సమర్పించారు. మనలను ఈజిప్టు నుండి తోడ్కొని వచ్చిన దేవర యితడే అని అరచి చిందులు త్రొక్కారు. అంతలో మోషే పదియాజ్ఞల రాతి పలకలు తీసికొని కొండ దిగివచ్చాడు. ప్రజల విగ్రహారాధనను చూచి ఆగ్రహం చెంది రాతి పలకలను అక్కడే పగలగొట్టాడు. బంగారు దూడను అగ్నిలో కాల్చి పిండి చేసి నీళ్లలో కలిపి ఆ నీటిని ప్రజలచే త్రాగించాడు. అహరోనుని చీవాట్లు పెట్టాడు. మోషే ఆనతిపై కొందరు లేవీయులు వెళ్లి విగ్రహారాధనకు పాల్పడిన వారిని మూడువేల మందిని కత్తులతో నరికివేశారు. మోషే ఆ లేవీయులను మెచ్చుకొన్నాడు.

## 29. మిర్యాముకి కుష్ఠ సోకడం - *సంఖ్యా 12*

మోషే యితియోపీయ స్త్రీని పెండ్లి చేసికొన్నాడు. పైగా అక్క మిర్యాముకి, అన్న అహరోనుకి అతని నాయకత్వం నచ్చలేదు. వాళ్లు మోషే వొక్కడే నాయకుడా మేము మాత్రం కామా అని గొణిగారు. దేవుడు వారిని మందలించాడు. నేను మోషేను నా ప్రజలందరికీ నాయకుణ్ణిగా నియమించాను. అతడు నా రూపాన్ని చూచాడు. నా సేవకుణ్ణి ఎదిరించడానికి మీకు ఎన్ని గుండెలు అని మండిపడ్డాడు. తమ్ముని ఎదిరించినందుకు శిక్షగా

మిర్యాముకి కుష్ఠసోకింది. అన్నా అక్కా యిద్దరూ పశ్చాత్తాపపడ్డారు. మోషే అక్క తరపున దేవునికి మనవి చేశాడు. ప్రభువు కరుణించి మిర్యాముకి ఆరోగ్యం దయచేశాడు. ఆమెను ప్రజలనుండి ఏడు రోజులపాటు వెలివేసి మళ్లా శిబిరానికి రానిచ్చారు.

## 30. కోరా తిరుగుబాటు - *సంఖ్యా 16*

కోరా, దాతాను, అబీరాము అనే లేవీయులు మోషే అహరోనుల మీద తిరగబడ్డారు. మీతో పాటు మేము కూడ ఈ సమాజానికి నాయకులమే అని వాదించారు. 250 మంది పెద్దలు కూడ వారితో చేరిపోయారు. మోషే ప్రజలందరినీ ప్రభువు గుడారం ముందు ప్రోగుజేశాడు. అక్కడ దేవుడు ప్రత్యక్షమై తిరుగుబాటు చేసిన వారిని ఖండించాడు. పై ముగ్గురు తమ గుడారాలకు వెళ్లిపోయారు. అక్కడ నేల బ్రద్దలై వారిని వారి కుటుంబాలను మ్రింగివేసింది. అగ్ని దిగివచ్చి 250 మంది తిరుగుబాటు దారులను కూడ కాల్చివేసింది. మరునాడు సమాజంలోని జనం మీరు యావే ప్రజలను చంపివేశారు కదా అని మోషే అహరోనుల మీద గొణిగారు. ప్రభువు వారిపై కోపించి అంటురోగం పంపాడు. దానివల్ల జనంలో 14,700 మంది చనిపోయారు. అహరోను సాంబ్రాణి పొగవేసి ప్రజల తిరుగుబాటుకి ప్రాయశ్చిత్తం చేయగా అంటురోగం సమసిపోయింది. యిస్రాయేలు ప్రజలు తలబిరుసు జనం. వాళ్లు ఒకపెట్టున పాఠం నేర్చుకునే వాళ్లు కాదు.

## 31. వేగు చూడబోయినవాళ్లు - *సంఖ్యా 13-14*

యిస్రాయేలు ప్రజలు కాదేషువద్ద విడిది చేశారు. మోషే తెగకు ఒక్కని చొప్పున పండ్రెండుమందిని ఎన్నుకొని వారిని కనాను దేశాన్ని వేగుచూడ్డానికి పంపాడు. వాళ్లు నలభై రోజుల తర్వాత తిరిగి వచ్చారు. ఆ దేశంలో కాసిన పెద్దద్రాక్ష గుత్తిని కర్రకు వ్రేలాడగట్టుకొని ఇద్దరు నరులు మోసికొని వచ్చారు. ఇంకా అచటి దానిమ్మపండ్లూ అంజూరాలు తీసికొని వచ్చారు. ప్రజలను పోగుజేసి ఆ దేశసమాచారం తెలియజేశారు. అక్కడి పట్టణాలు ప్రాకారాలతో బలిష్ఠంగా వున్నాయనీ, అచటి నరులు రాక్షసుల్లాగ

చాలా పొడవుగా వున్నారనీ చెప్పారు. మనం వాళ్లను జయించలేము అని పల్కారు. ఆమాటలు విని జనం భయపడి నిరుత్సాహం చెందారు. ఇంకో నాయకుణ్ణి ఎన్నుకొని ఈజిప్టుకి తిరిగిపోతే బాగుంటుందిఅనుకొన్నారు. పండ్రెండుమంది వేగుల వారిలో యోషువా, కాలెబు మాత్రం దైవ సహాయంతో ఆ దేశాన్ని జయించవచ్చు అని పల్కారు. ఐనా ప్రజలు వారి మాటలు వినక తిరగబడ్డారు. ఆజనం తన శక్తినీ సహాయాన్నీ నమ్మనందుకు దేవుడు ఆగ్రహం చెందాడు. వారిలో ఇరవైయేండ్లకు పైబడినవాళ్లు ఎవరూ కనాను దేశంలో అడుగుపెట్టక ఎడారిలోనే చనిపోతారని చెప్పాడు. యోషువా కాలెబులు మాత్రం ఈ శాపానికి మినహాయింపు. ఇంకా ఆ ప్రజలు 40 ఏండ్లపాటు ఎడారిలోనే తిరుగాడుతుంటారని గూడ చెప్పాడు. మనం కనాను దేశాన్ని జయించలేము అని చెప్పి ప్రజలను నిరుత్సాహ పరచిన పదిమంది వేగుల వాళ్లను రోగంతో చంపివేశాడు.

## **32. కంచుసర్పం** - *సంఖ్యా 21,4-9*

ఎడారి, ప్రయాణంలో ప్రజలు విసిగిపోయారు. రోజూ యీ రుచీపచీలేని మన్నా భోజనమేనా అని మోషే మీద తిరగబడ్డారు. దానికి శిక్షగా ప్రభువు విషసర్పాలను పంపగా అవి చాలమందిని కరచి చంపాయి. ప్రజలు మేము తప్పు చేశాం. నీవు ఈ పాముల బెడదను తొలగించమని దేవునికి మనవి చేయి అని మోషేను వేడుకొన్నారు. దేవుని ఆజ్ఞపై మోషే కంచుసర్పం చేసి గడెమీద తగిలించాడు. దానివైపు చూచినవాళ్లు పాము కాటునుండి తప్పించుకొన్నారు. ఇక్కడ కంచుసర్పం ప్రజలను రక్షించలేదు. అది వట్టి బొమ్మ. ఆ బొమ్మవైపు చూడ్డం ద్వారా ప్రజలు దేవునికి విధేయులయ్యారు. ఆ బొమ్మద్వారా దేవుడే ప్రజలను కాపాడాడు.

## **33. బిలాము గాడిద మాటలాడ్డం** - *సంఖ్యా 22*

యిస్రాయేలీయులు ఎడారిలో ప్రయాణం చేస్తూ మోవాబు దేశం దగ్గరికి వచ్చారు. ఆ దేశపు రాజైన బాలాకు వారికి భయపడి పేతోరు నివాసి మాంత్రికుడునైన బిలాము దగ్గరికి దూతలను పంపాడు. బిలాము వచ్చి శపిస్తే యిస్రాయేలు బలం ఉడిగిపోతుందనీ అప్పుడు తాను వారిని

సులువుగా జయించవచ్చుననీ బాలాకు పన్నాగం. మొదటిసారి పిలువగా రాలేదు గాని, రెండవసారి కూడ పిలువగా బిలాము గాడిద నెక్కి పయన మయ్యాడు. కాని అతని రాక దేవునికి ఇష్టంలేదు. దారిలో బిలాము గాడిద కత్తి చేతబట్టుకొని వున్న దేవదూతను చూచి భయపడి ప్రక్క పొలంలోనికి తప్పుకొంది. బిలాము దేవదూతను చూడలేదు. గాడిదను కఱ్ఱతో బాది దారికి మరల్చాడు. రెండవమారు అది దేవదూతను చూచి భయపడి గోడప్రక్కగా పోగా బిలాము కాలు గోడకు రాచుకొంది. అతడు మళ్లా దాన్ని కొట్టాడు. మూడవసారి అది తనకు అడ్డముగా నిలబడివున్న దేవదూతను చూచి ముందుకు కదలలేక నేలమీద చతికిలబడింది. బిలాము మళ్లా దాన్ని చావమోదాడు. గాడిద నీవుఇప్పటికి మూడుసార్లు నన్ను కొట్టావు. నేను నీకు ఏమి యపకారం చేశాను అని అడిగింది. అతడు నీవు నన్ను ఎగతాళి చేస్తున్నావు. నా చేతిలో కత్తి వుంటే ఈపాటికి నిన్ను నరికి వేశేవాణ్ణి అన్నాడు. అప్పుడు బిలాముకి కూడ దేవదూత కన్పించాడు. అతడు నీ ప్రయాణం నాకు ఇష్టంలేదు. నీ గాడిద మూడుసార్లు నన్ను జూచి తప్పుకొందిగాని లేకపోతే నిన్ను చంపివేసి దాన్ని వదిలివేసే వాణ్ణి. నీవు బాలాకు దగ్గరికి వెళ్లినప్పుడు నేను పలకమన్న పలుకులు మాత్రమే పలకాలి సుమా అని ఆదేశించాడు. తర్వాత బాలాకు దూరంగా విడిది చేసివున్న యిస్రాయేలీయులను బిలాముకి చూపించి నీవు వీరిని శపించు అని చెప్పాడు. కాని బిలాము దైవప్రేరితుడై వారిని శపించడానికి బదులుగా దీవించాడు. ఈలా మూడుసార్లు జరిగింది. బాలాకు కోపించి ఏ బహుమతి ఈయకుండానే బిలాముని పంపివేశాడు.

## 34. మోషే మరణం - *ద్వితీ 34*

మోషేకు 120 ఏండ్లు వచ్చాయి. అతడు నెబో కొండమీది పిస్గా శిఖరాన్ని ఎక్కాడు. అక్కడి నుండి ప్రభువు కనాను దేశాన్ని అంతటినీ చూపించాడు. అతడు మాత్రం ఆ దేశంలో అడుగుపెట్టడానికి వీల్లేదు. మోషే యోషువాను తనకు అనుచరునిగా ప్రకటించాడు -సంఖ్యా 27,22-23. ఇతడు ప్రజలను కనాను దేశానికి చేరుస్తాడు. చనిపోయే వరకు

మోషే శక్తి సన్నగిల్లనూ లేదు, దృష్టి మందగించనూ లేదు. ప్రభువే అతన్ని మోవాబు లోయలో పాతిపెట్టాడు. కాని అతని సమాధి ఎక్కడుందో ఎవరికీ తెలియదు. నేటివరకు యిస్రాయేలీయుల్లో మోషేలాంటి ప్రవక్త మళ్లా పుట్టలేదు. అతడు దేవునితో ముఖాముఖి సంభాషించిన మహాభక్తుడు. అతని జీవితాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. తొలి నలభైయేండ్లు ఈజిప్టులో రాజకుమారుడుగా తర్ఫీదు పొందాడు. అటుతర్వాత నలభైయేండ్లు ఎడారిలో గొర్రెల కాపరిగా జీవించాడు. చివరి నలభై యేండ్లు యిస్రాయేలు ప్రజలకు నాయకుడుగా మెలిగాడు.

## 35. యెరికో పట్టణాన్ని జయించడం - *యోషు 6*

యిస్రాయేలు ప్రజలు యోషువా నాయకత్వాన కనాను దేశానికి వచ్చారు. కాని ఆ దేశంలో ప్రవేశించాలంటే మొదట యెరికో పట్టణాన్ని జయించాలి. అది ప్రపంచంలోని పురాతన నగరాల్లో వొకటి. దానికి బలమైన ప్రాకారం వుంది. దేవుని ఆజ్ఞ ప్రకారం ఏడ్గురు యాజకులు బూరలనూదుతూ నగరం చుట్టూ తిరిగివచ్చారు. వారి వెనుక దైవమందసం వుంది. ముందు వెనుకల సైనికులు వున్నారు. ఈ విధంగా ఆరురోజులు నగరం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఏడవరోజు అదే ప్రదక్షిణం ఏడుసార్లు చేశారు. యాజకులు బూరలు ఊదుతూండగా సైనికులు యుద్ధనాదం చేశారు. ఆ శబ్దానికి కోటగోడలు వాడంతట అవే విరిగిపడ్డాయి. యిస్రాయేలు సైన్యం నగరంలో జొరబడి దాన్ని నాశం జేశారు. ఈ కార్యమంతా యావే నిర్ణయించినట్లుగానే జరిగింది.

## 36. ఆకానుకి శిక్ష - *యోషు 7*

యిస్రాయేలు ప్రజలు శత్రు నగరాలను ముట్టడించినపుడు అచటి నరులను, జంతువులను, వస్తువులను నాశం చేయాలి. వేటిని దక్కించుకో గూడదు. ఇది ప్రభువు ఆజ్ఞ. వారి సైనికులు కనాను దేశంలోని హాయి పట్టణాన్ని ముట్టడించారు కాని జయించలేకపోయారు. కారణమేమిటా అని విచారించగా ఆకాను అనే సైనికుడు దోషి అని తేలింది. అతడు నగరంలోని దోపిడి వస్తువుల్లో వెండిబంగారాలు పట్టుబట్టలు దక్కించుకొని వాటిని తన

గుడారంలో దాచిపెట్టుకొన్నాడు. దానివలన యావే కోపించి యుద్ధంలో యిస్రాయేలు సైనికులు ఓడిపోయేలా చేశాడు. యోషువా ఆజ్ఞపై ఆకానునీ అతని కుటుంబాన్నీ రాళ్లతో కొట్టి చంపివేశారు. అతడు దేవుని ఆజ్ఞమీరినందుకు అది శిక్ష. తర్వాత సైనికులు హాయి పట్టణాన్ని రెండవసారి ముట్టడించి గెల్చారు.

## **37. ఏహూదు ఎగ్లోనుని జయించడం** – *న్యాయాధి 3*

కనాను దేశంలో మోవాబు రాజైన ఎగ్లోను యిస్రాయేలీయులను జయించి వారిని పద్దెనిమిది యేండ్లు దాసులనుగా ఏలాడు. ప్రభువు అతన్ని ఓడించడానికి ఏహూదు అనే న్యాయాధిపతిని ఎన్నుకొన్నాడు. అతడు పురచేతి యోధుడు. ఏహూదు ఎగ్లోనుకి కప్పం కట్టడానికి డబ్బు తీసికొని వచ్చి రాజా! నేను నీకొక దైవసందేశాన్ని విన్పించాలి అని చెప్పాడు. రాజు సేవకులందరినీ వెలుపలకు పంపివేసి మీది గదిలోనికి వెళ్లాడు. ఏహూదు తన ఉడుపుల్లో పెద్ద కత్తిని దాచాడు. పురచేతితో కత్తిదూసి ఎగ్లోను పొట్టలో పొడిచాడు. ఆరాజు బాగా బలసినవాడు. కత్తీ దాని పిడికిలీ అతని పొట్టలో దూరగా కొవ్వు వెలుపలికి వచ్చింది. ఆలా రాజు చనిపోగా ఏహూదు అనుచరులు మోవాబు వీరులతో యుద్ధం జేసి వారిని ఓడించారు. దాస్యం నుండి తప్పించుకొన్నారు.

## **38. గిద్యోను చిన్న దండు** – *న్యాయాధి 7*

మిద్యానీయులు యిస్రాయేలీయులను ఏడేండ్లపాటు పీడించి పిప్పి చేశారు. శత్రువులను ఓడించి తన ప్రజలను కాపాడ్డానికి ప్రభువు గిద్యోనుని ఎన్నుకొన్నాడు. ఆ వీరుడు దేవునికి పరీక్ష పెట్టాడు. తాను కళ్లంలో గొర్రెవున్ని పెట్టగా అది మాత్రమే మంచులో తడిసి కళ్లమంతా పొడిగా వుండాలి. అతడు కోరినట్లే జరిగింది. అతడు మళ్లా రెండవ పరీక్ష పెట్టాడు. ఈసారి ఉన్ని పొడిగా వుండి కళ్లమంతా మంచులో తడవాలి. మళ్లా అతడు కోరినట్లే జరిగింది. కనుక దేవుడు గిద్యోను ద్వారా యిస్రాయేలును రక్షిస్తాడని రుజువైంది. ఇకనేం, గిద్యోను 32వేలమంది సైనికులను ప్రోగు జేసికొని మిద్యానీయుల మీదికి యుద్ధానికి పోయాడు. కాని ప్రభువు ఇంతమంది

సైనికులు అక్కరలేదు. వీళ్లు తర్వాత మా బలంతో మేమే గెల్చామని గొప్పలు చెప్పుకొంటారు. నీ సైన్యాన్ని తగ్గించు అని చెప్పాడు. గిద్యోను యుద్ధానికి భయపడేవాళ్లంతా వెళ్లిపోండి అని చెప్పగా చాలమంది తిరిగిపోయారు. కేవలం 300 మందితో మాత్రమే గిద్యోను యుద్ధానికి పోయాడు. శత్రుసైన్యం 35 వేలమంది వున్నారు.

గిద్యోను సైనికులు అర్ధరాత్రిలో బూరలు చేతబట్టి కుండల్లో దీపాలు పెట్టుకొని శత్రుశిబిరం దగ్గరికి వచ్చారు. దిడీలున కుండలు పగలగొట్టి దీపాలు చూపించారు. బూరలను ఊదారు. ఆ శబ్దానికీ వెల్తురుకీ శత్రువులు కలవరపడి లేచారు. బెదిరిపోయి దిక్కుదోచక తమపక్షం వారినే ఒకరి నొకరు చంపుకొన్నారు. మిగిలినవాళ్లు పారిపోయారు. గిద్యోను సైనికులు వారిని వెన్నాడి తరిమికొట్టారు. ఈ రీతిగా ప్రభువు కొద్దిపాటి సైన్యంతోనే గిద్యోనుకి విజయాన్ని ప్రసాదించాడు

## 39. సీస్రా వధ - *న్యాయాధి 4*

యిస్రాయేలీయులు ధర్మశాస్త్రాన్ని మీరి పాపం కట్టుకోగా యావే వారిని కోపించి కనాను రాజయిన యాబీనుకి దాసులను చేశాడు. ఆరాజు వారిని ఇరవైయేండ్లు పీడించాడు. అతని సైన్యాధిపతి సీస్రా. ఆరోజుల్లో లప్పీడోతు భార్య దెబోరా న్యాయాధిపతి. ప్రభువు ఆమెను ప్రేరేపించాడు. ఆమె యుద్ధవీరుడైన బారాకును పిలిపించి నీవు పదివేలమంది సైనికులతో బోయి కీషోను వాగు దగ్గర సీస్రాతో యుద్ధంచేయి. ప్రభువు మనకు విజయాన్ని ప్రసాదిస్తాడు అని చెప్పింది. కాని బారాకు దడిశాడు. నీవు గూడ సైన్యంతో వస్తే నేను యుద్ధం జేస్తాను అన్నాడు. దెబోరా నేను తప్పక వస్తాను. కాని సీస్రాను వోడించిన కీర్తి నీకుగాక ఓ ఆడగూతురుకి దక్కుతుంది అని ప్రవచించింది. కీషోను నది దగ్గర ఉభయ సైన్యాలు తారసిల్లాయి. బారాకు పదివేలమంది యోధులతో వచ్చాడు. సీస్రా 900 ఇనుపరధాలతోను లక్షమంది సైన్యంతోను వచ్చాడు. కాని ప్రభువు బారాకు సైన్యాన్ని చూడగానే సీస్రా దండుకి కలవరం పుట్టేలా చేశాడు. ఆ సమయంలో వానకురిసి సీస్ర రధాలు బురదలో కూరుకొన్నాయి. కనుక

పోరులో సీస్రా సైన్యం వోడిపోయింది. సీస్రా పారిపోయి హేబెరు భార్య యాయేలు గుడారంలో తలదాచుకొన్నాడు. ఆమె అతన్ని ఆహ్వానించి త్రాగడానికి మజ్జిగ నిచ్చి కంబళితో కప్పింది. సీస్రా బాగా అలసిపోయి వున్నందున మైమరచి  నిద్రపోయాడు. యాయేలు గుడారపు మేకు తీసికొని నిద్రలో వున్న సీస్రా కణతల్లో దిగగొట్టగా అతడు ప్రాణాలు విడిచాడు. బారాకు సీస్రాను తరుము కొంటూ వచ్చి చచ్చిపడివున్న వాణ్ణి చూచాడు. సైన్యాధిపతి చనిపోగా యాబీను బలముడిగి యిస్రాయేలీయులకు లొంగిపోయాడు. యాయేలు అతిథిని నమ్మించి మోసం చేసింది. కాని ఆమె యుద్ధంలో యిస్రాయేలు పక్షాన్ని ఎన్నుకొంది. దేవుడు ఒక అబలద్వారా మహావీరుణ్ణి మన్ను కరిపించాడు.

## 40. యెఫ్తా వ్రతం - *న్యాయాధి 11,29-40*

అమ్మోనీయులు గిలాదు మండలంలోని యిస్రాయేలీయులను పీడించారు. గిలాదు పౌరులు యెఫ్తాను న్యాయాధిపతిగా నాయకుణ్ణిగా ఎన్నుకొని శత్రువుల మీదికి యుద్ధానికి పంపారు. అతడు మహాశూరుడు. అతడు దేవునికి మ్రొక్కుకొన్నాడు. ఈ యుద్ధంలో నీవు నాకు విజయాన్ని ప్రసాదిస్తే నేను పోరునుండి తిరిగివచ్చినపుడు నాకు ఎదురువచ్చిన వారిని నీకు బలిగా అర్పిస్తాను అని వ్రతం పట్టాడు. యెఫ్తా ఏ జంతువో లేక ఏ బానిసో ఎదురు వస్తారు అనుకొన్నాడు. పోరులో యెఫ్తా గెల్చాడు. కాని అతడు ఇంటికి తిరిగివచ్చినపుడు అతని కూతురే నాట్యం జేస్తూ తండ్రికి స్వాగతం జెప్పడానికి ఎదురు వచ్చింది. ఆమె అతనికి ఒక్కతే బిడ్డ. ఆ బలికను చూడగానే యెఫ్తాకు గుండెలు పగిలాయి. ఐనా తన వ్రతాన్ని నిలబెట్టుకోగోరాడు. ఆ బాలిక రెండు నెలలపాటు కొండల్లోకిపోయి నిష్ఫలమైపోయిన తన కన్యత్వాన్ని తలంచుకొని శోకించివచ్చింది. తండ్రి తాను దేవునికి మాటయిచ్చినట్లే కూతురుని బలియిచ్చాడు. యిస్రాయేలు స్త్రీలు ఆ బాలికను తలంచుకొని ఏటేట నాల్గురోజులు శోకించడం ఆచార మైంది. యెఫ్తాలాగ తొందరపాటు ప్రమాణాలు చేయకూడదు. దేవుణ్ణి ఏ పద్ధతిలో పూజించాలో తెలిసివుండాలి.

## 41. సంసోను జననం - *న్యాయాధి 13*

ఫిలిస్టీయులు నలభైయేండ్లపాటు యిస్రాయేలు జనాన్ని రాచిరంపాన బెట్టారు. వారి బారినుండి తన ప్రజలను కాపాడ్డానికి ప్రభువు సంసోనుని ఎన్నుకొన్నాడు. అతని తండ్రి మనోవా. తల్లి గొడ్రాలు. ఒకదినం దేవదూత ఆమెకు దర్శనమిచ్చి నీకొక బిడ్డడు పుడతాడు. ఆ బిడ్డడు ద్రాక్షరసంగాని మద్యంగాని సేవింపగూడదు. వాని తలజుట్టు కత్తిరించకూడదు. నాజరేయ వ్రతాన్ని పాటించాలి. దైవసేవలో వుండిపోవాలి అని చెప్పాడు. తర్వాత ఆమెకు మగబిడ్డడు కలగగా అతనికి సంసోను అని పేరుపెట్టారు. అతడు చిన్ననాటినుండి అసాధారణమైన బలం కలవాడు. ఒకసారి సింహం అతని మీదికి దూకగా దాన్ని పట్టుకొని మేకపిల్లను లాగ చీల్చివేశాడు. ఇంకొకసారి గాడిద దౌడ ఎముకతో బాది వేయిమంది ఫిలిస్తీయులను చంపాడు. ఇంకొక సారి శత్రువులు తన్ను త్రాళ్లతో బంధింపగా వాటిని నూలు పోగుల్లాగ త్రెంచివేశాడు. ఫిలిస్టీయులు అతని బలానికి దడిశారు.

## 42. డెలీలా మోసం - *న్యాయాధి 16,15-22*

సంసోను యిస్రాయేలు ప్రజలకు న్యాయాధిపతి. వారి శత్రువులు ఫిలిస్టీయులు. అతడు ఫిలిస్టీయ యువతి డెలీలా వలలో చిక్కుకొన్నాడు. సొంత జాతివాళ్లు ఆమెకు లంచంపెట్టి సంసోను విచిత్రబలం దేనిలో వుందో తెలిసికొమ్మన్నారు. అతడు మొదట తన బలరహస్యాన్ని తెలియజేయలేదు. కాని డెలీలా విసిగించడం వల్ల ఆమె పోరు బడలేక నాబలం నా తలజుట్టులో వుంది. దాన్ని కత్తిరించివేస్తే నాబలం పోతుంది అని చెప్పాడు. అతడు నాజరేయవ్రతాన్ని చేపట్టాడు. ఆ వ్రతం పాటించేవాళ్లు జుట్టు గొరిగించు కోరు. ఆ వ్రతమే అతనికి గొప్ప బలాన్నిచ్చింది. డెలీలా సంసోనుని నిద్రపుచ్చి అతని జడలు ఏడింటిని గొరిగించింది. దానితో సంసోను బలం నశించింది. ఫిలిస్టీయులు అతన్ని సులువుగా బంధించి కన్నులు పెరికివేశారు. గాసాకు కొనిపోయి అతనిచే గానుగమాను త్రిప్పించారు. మహావీరుడు తన పొరపాటు వల్లనే గానుగను త్రిప్పే పశువుతో సమానమయ్యాడు. గొప్పవారి అగచాట్లు గూడ గొప్పవిగానే వుంటాయి.